క్లుప్తంగా

బాలకృష్ణమ్మ పోరాటాలు ఆదర్శనీయం



బాలకృష్ణమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

టెక్కలి: ఉపాధ్యాయుల సమస్యల సాధన కోసం ఉద్యమ నేత మార్పు బాలకృష్ణమ్మ చేసిన పోరాటాలు ఆదర్శనీయమని ఏపీటీఎఫ్ ప్రతినిధులు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో బాలకృష్ణమ్మ సంస్మరణ సభను ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఆయన చేసిన పోరాటాలు నేటి తరం ఉపాధ్యాయులకు ఎంతో ఆదర్శనీయమని కొనియాడారు. కార్యక్రమంలో సంఘ నాయకులు సురేష్‌కుమార్, చిట్టిన్న, గున్న ప్రసాదరావు, బి.రామారావు, చిలుకు కృష్ణారావు, వై.శేషగిరిరావు, బి.నారాయణరావు, చమళ్ల భాస్కరరావు, నారాయణమూర్తి, టి.భాస్కరరావు, గణపతి, ధర్మారావు ఉన్నారు.

రచయిత తెప్పలకు సత్కారం



కృష్ణమూర్తిని సత్కరిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: రాజమహేంద్రవరం గైట్ కళాశాలలో ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న రెండవ అంతర్జాతీయ తెలుగు మహాసభల్లో భాగరా అంతర్జాతీయ కవి సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా పలాసకు చెందిన ప్రముఖ రచయిత, నటుడు, లయన్ డాక్టర్ తెప్పల కృష్ణమూర్తి 'నా జన్మభూమి' కవితను వినిపించి ప్రశంసలు పొందారు. ఈ సందర్భంగా సంచాలకులు డాక్టర్ ఎస్ఆర్ఎస్ కొల్లూరి, ప్రముఖ కథా రచయిత్రి గుడిపూడి రాధికారాణి చేతుల మీదుగా ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. సాహితీ అభిమానులు, కళాకారులు కృష్ణమూర్తిని అభినందించారు.

కుమార్ నాయక్‌కు కళానిధి పురస్కారం



అవార్డు అందుకుంటున్న కుమార్ నాయక్

కాశీబుగ్గ: రెండవ అంతర్జాతీయ తెలుగు మహాసభలు రాజమండ్రిలో ఈ నెల ఐదు, ఆరు, ఏడు తేదీల్లో జరిగాయి. ఏడో తేదీన జరిగిన ముగింపు వేడుకల సందర్భంగా పలాస పట్టణానికి చెందిన రంగస్థల కళాకారుడు కుమార్ నాయక్‌కు కళానిధి పురస్కారాన్ని నాగాలాండ్ గవర్నర్ లాల్ గణేషన్ అందజేశారు. రాజరాజ నరేంద్ర వేదికపై మూడు రోజులపాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్విఘ్నంగా కొనసాగించడానికి కృషి చేసినందుకు కుమార్ నాయక్‌కు పురస్కారం దక్కింది.

వందకిలో మీటర్లు వెళ్లి.. పింఛన్ అందజేసి..



మల్లమ్మ పాత్రోకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సందీప్ వదం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 26వ వార్డుకు చెందిన పొందర మల్లమ్మ పాత్రో అనారోగ్యంతో శ్రీకాకుళంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. దీంతో ఈ నెలకు ఆమెకు మంజూరైన వృద్ధాప్య పింఛన్‌ను వలంటీర్ కోట్ని సందీప్ వదం కిలోమీటర్లు ప్రయాణించి ఆస్పత్రిలో ఆదివారం అందజేసి ఆదర్శంగా నిలిచారు.

విద్యార్థుల శ్రమదానం



చెత్తను ఏరుతున్న విద్యార్థులు

కంచిలి: కంచిలిలోని బీసీ బాలుర వసతి గృహం విద్యార్థులు స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం శ్రమదానం చేశారు. వసతి గృహం, జడ్పీ హైస్కూల్, జూనియర్ కళాశాల ప్రాంగణాల్లో చెత్తను, పిచ్చిమొక్కలను తొలగించారు. అనంతరం వాటికి నిప్పంటించారు. హాస్టల్ వార్డెన్ గుళ్ల రామారావు, కుక్ త్రినాథ్ పాల్గొన్నారు.

అయోధ్య రాముని అక్షింతలు పంపిణీ

కంచిలి: అయోధ్య రామ మందిరం నుంచి వచ్చిన అక్షింతలను స్థానిక రామభక్తులు ప్రజలకు ఆదివారం పంపిణీ చేశారు. కంచిలి పంచాయతీ పరిధి బలియాపుట్టుగ కాలనీ, మఠం కంచిలి తదితర ప్రాంతాల్లో వీటిని ఇంటింటికీ వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో వ్యాపారి వూనా శ్రీకాంత్, కె.గిరి, కె.విజయబాబు, జి.పైడిరాజు, మహిళా భక్తులు ఉన్నారు.

విద్యలో సాంకేతిక విప్లవం

విద్యా విధానంలో సాంకేతిక విప్లవం ప్రత్యేక స్థానాన్ని చోటు చేసుకుంటోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులు ఉన్నత స్థాయి విద్యను అభ్యసించే క్రమంలో సాంకేతిక విద్యా విధానంపై సరైన పట్టులేకపోవడంతో ఎన్నో విలువైన అవకాశాలను కోల్పోతున్నారు. ఇదంతా గత ప్రభుత్వాలు ఉన్నప్పుడు ఎదురైన సంఘటనలు. అయితే వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత విద్యార్థులు సాంకేతిక విద్యలో సైతం ప్రత్యేకంగా నిలవాలనే ఆకాంక్షతో సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సరికొత్త ఆలోచనతో ప్రాథమిక స్థాయిలో సాంకేతిక విద్యా విధానానికి పునాదులు వేశారు. ఇందులో భాగంగానే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేశారు. గత ఏడాది నుంచి ఈ కార్యక్రమం దిగ్విజయంగా కొనసాగుతోంది. బైజూస్ నిర్వాహణతో ఈ ట్యాబ్‌ల ద్వారా ప్రాథమిక స్థాయి నుంచి సాంకేతిక విద్యపై విద్యార్థులు పట్టు సాధిస్తున్నారు.

–టెక్కలి



నందిగాం మండలం లఖిదాసుపురం పాఠశాలలో ట్యాబ్‌ల ద్వారా పాఠాలు నేర్చుకుంటున్న విద్యార్థులు



రెండు విడతల్లో 5,933 ట్యాబ్‌లు పంపిణీ

టెక్కలి నియోజకవర్గంలో రెండు విడతలుగా 5,933 ట్యాబ్‌లను విద్యార్థులకు పంపిణీ చేశారు. తొలి ఏడాది 2,748 మంది విద్యార్థులు, 561 మంది ఉపాధ్యాయులకు ట్యాబ్‌లను అందజేశారు. ఈ ఏడాది 2,624 మంది విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే 1360 మందికి అందజేశారు.

- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ట్యాబ్‌లు
- బైజూస్ సంస్థ నిర్వాహణతో నాణ్యమైన సాంకేతిక పాఠాలు

టెక్కలి నియోజకవర్గంలో గత ఏడాది పంపిణీ చేసిన ట్యాబ్‌లు

మండలం	విద్యార్థులు	ఉపాధ్యాయులు
టెక్కలి	733	135
కోటబొమ్మాళి	766	157
సంతబొమ్మాళి	759	142
నందిగాం	490	127



టెక్కలి ఎన్‌టీఆర్ కాలనీ నిరుపేద కుటుంబానికి చెందిన షేక్ అఫ్సర టెక్కలి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. వీరిది సాధారణ కుటుంబం. బయట కంప్యూటర్ విద్యను ప్రాథమికంగా నేర్చుకోలేని పరిస్థితి. ఇటువంటి సమయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేసిన ట్యాబ్‌ను గత ఏడాది 8వతరగతిలో షేక్ అఫ్సర అందుకుంది. దానితో ద్వారా సాంకేతిక విద్యను అందిపుచ్చుకొని కల నెరవేర్చుకుంది.



నందిగాం మండలం లఖిదాసుపురం గ్రామంలోని మధ్య తరగతి కుటుంబానికి చెందిన పల్ల ధరణి అదే గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతోంది. గ్రామీణ ప్రాంతం కావడంతో సాంకేతిక విద్య కావాలంటే ఎంతో ప్రయాసపడాల్సిన పరిస్థితి. ఇదే సమయంలో గత ఏడాది ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌ను అందుకుంది. దీని ద్వారా ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం కలిగిన పాఠాలను నేర్చుకుంటోంది.

సందడిగా పింఛన్ల పంపిణీ



కాశీబుగ్గ: 12వ వార్డులో పింఛన్లు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు హరిప్రసాద్, నేతాజీ



కాశీబుగ్గ: 19వ వార్డులో పింఛన్లు పంపిణీ చేస్తున్న శిష్టు గోపి



కవిటి: దూగానపుట్టుగలో కొత్త పెన్షన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు



కోటబొమ్మాళి: శ్రీజగన్నాథపురంలో నూతన పింఛన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ నూక సత్యరాజ్



కోటబొమ్మాళి: అక్కయ్యవలసలో ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సర్పంచ్ సుంకరి జనార్దనరావు, లబ్ధిదారులు

పింఛన్ల పంపిణీ ప్రక్రియ ఆదివారం కూడా ఉత్సాహంగా సాగింది. ప్రజాప్రతినిధులు, అధికారులు భాగస్వాములయ్యారు. కొత్త పింఛన్ల పంపిణీ సందడిగా సాగింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలియజేశారు.



ఇచ్ఛాపురం రూరల్: జగన్నాథపురంలో పింఛన్ అందజేస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు ఆశి మంధాకిని

రెండు వేల మందికి వస్త్రదానం



వస్త్రదానం చేస్తున్న డాక్టర్ శ్రీధర్

కవిటి: శ్రీకాకుళం కేంద్రంగా పనిచేస్తున్న దానేటి శ్రీధర్ చారిటబుల్ ట్రస్టు అందజేస్తున్న సేవలు నిరుపమానమైనవని వక్తలు కొనియాడారు. రాజపురంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో రెండు వేల మంది వృద్ధులు, వితంతువులు, పేదలకు దుప్పట్లు, చీరల్ని పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు దానేటి శ్రీధర్ వీటిని పేదలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజపురం పరిసర ప్రాంతాలకు చెందిన పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు సర్టిఫికెట్ కోర్సు చేసేందుకు ఆసక్తి ఉంటే తమను నేరుగా సంప్రదించాలన్నారు. వారందరికీ తానే ఫీజుకట్టి కోర్సు పూర్తిచేయించి ఉద్యోగకల్పన బాధ్యత తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ డీఎస్పీ ఎస్‌వీవీ ప్రసాదరావు, స్థానిక సర్పంచ్ సనపల జానకీరావు, ఎంపీటీసీ సభ్యుడు కృష్ణారావు, పీఏసీఎస్ డైరెక్టర్ ఎన్ని అశోక్, కరాపాడు సర్పంచ్ మురపాల లచ్చయ్య ఉన్నారు.

విద్యార్థులకు దుస్తులు వితరణ



విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: దంత గ్రామానికి చెందిన గొండు చారిటబుల్ ట్రస్టు చైర్మన్, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పీఏ గొండు మురళీ తన కుమార్తె దివంగత ప్రణతి జ్ఞాపకార్థం, సంక్రాంతి పండుగ సందర్భంగా స్థానిక యూపీ స్కూల్‌కు చెందిన వంద మంది విద్యార్థులకు ఆదివారం దుస్తులను పంపిణీ చేశారు. అలాగే పాఠశాలకు 14 బెంచీలను అందజేశారు. అంతకు ముందు మురళీ సతీమణి, గ్రామ సర్పంచ్ గొండు చాందిని చేతులమీదుగా రూ. 2.50 లక్షల వ్యయంతో స్కూల్ ఆవరణలో నిర్మించిన కళావేదికను ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జి.నారాయణరావు, కొత్తమ్మతల్లి ఆలయ కమిటీ సభ్యుడడు బాడాన గోవిందరావు, వార్డు సభ్యులు చల్ల తిరుపతి, వెలమల కుమార్ ఉన్నారు.

వైఎస్సార్ ఆసరాతో జీవనోపాధులు మెరుగు



ర్యాలీ చేస్తున్న లబ్ధిదారులు

మందస: రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తోందని, దీనిలో భాగంగా వైఎస్సార్ ఆసరా పథకాన్ని అందిస్తోందని మందస మేజరు పంచాయతీ మందస సర్పంచ్ చెరుకుపల్లి యల్లమ్మ, సెర్ప్ ఏపీఎం గొడబ ప్రసాదరావు, ఎంపీటీసీ సభ్యుడు కంచిబెహరా అన్నారు. మందసలో ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆసరా నిధులతో మహిళల కుటుంబాలకు ఆర్థిక భరోసా దొరుకుతుందన్నారు. పంచాయతీలోని 170 గ్రూపులకు రూ.4.39 కోట్లు వైఎస్సార్ ఆసరాతో రుణమాఫీ అవుతుందన్నారు. మహిళా సాధికారితే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. అనంతరం మందస పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు సీహెచ్ లక్ష్మణమూర్తి, వీవోఏలు నాగమణి, గాయత్రి, నీరజ, శారద, శోభరాణి, వీవో అధ్యక్షులు మీన, లత పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కారానికి కృషి



సమావేశంలో సంఘ ప్రతినిధులు

సోంపేట: రాష్ట్రంలోని పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా యూనియన్ నాయకుడు రామచంద్రారావు అన్నారు. సోంపేటలోని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో విశ్రాంత ఉద్యోగులతో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ.. పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం సంఘం తరపున కృషి చేస్తున్నట్టు చెప్పారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రెసిడెంట్ ధర్మారావు, సంఘ ప్రతినిధులు పి.కృష్ణారావు, రఘునాథ్ పాడి, టి.జోగారావు ఉన్నారు.

క్రీడలతో స్నేహ సంబంధాలు బలోపేతం



బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ రామారావు

కవిటి: క్రీడలతో స్నేహ సంబంధాలు బలోపేతం అవుతాయని ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. డి.గొనపపుట్టుగలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను ఆదివారం ప్రారంభించారు. ప్రతిభ యువజన సంఘం నిర్వహిస్తున్న ఈ టోర్నీని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నేతలు కడియాల ప్రకాష్, దాసరి రాజు, బి.జయప్రకాష్, కిరణకుమారి, పూర్ణచంద్రుడు, జల్లు యుగంధర్ ఉన్నారు.

ఓటు వజ్రాయుధం



మాట్లాడుతున్న మల్లేశ్వరరావు

కాశీబుగ్గ: ఓటు వజ్రాయుధమని..దాన్ని తప్పనిసరిగా సక్రమంగా వినియోగించుకోవాలని పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ సోషల్ డెవలప్మెంట్ స్పెషలిస్ట్ చెన్నూరు మల్లేశ్వరరావు అన్నారు. మున్సిపాలిటీలో యువతకు ఓటు హక్కుపై ఆదివారం అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరునికి ఓటు హక్కును భారత రాజ్యాంగం కల్పించిందన్నారు. ఎన్నికల్లో సమర్థవంతమైన ప్రజాప్రతినిధిని ఓటు ద్వారా ఎన్నుకోవాలని సూచించారు. 18 ఏళ్లు నిండినవారు విధిగా ఓటరుగా చేరాలని విజ్ఞప్తి చేశారు.

మాజీ ఎమ్మెల్యే జగన్నాయకులకు ఘనంగా నివాళి



జగన్నాయకులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: అగ్నికుల క్షత్రియ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం బారువలో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు పలాస మండలం నుంచి పలువురు తరలివెళ్లారు. ఇందులో భాగంగా తొలుత పలాస మాజీ ఎమ్మెల్యే జుత్తు జగన్నాయకులు చిత్రపటానికి అగ్నికుల క్షత్రియ యూత్‌ఫోర్స్ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కాశీబుగ్గ అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో అధికసంఖ్యలో యువకులు పాల్గొన్నారు.

గ్యాస్ కనెక్షన్లు పంపిణీ



గ్యాస్ సామగ్రితో లబ్ధిదారులు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని గరుడబద్రలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఉచితంగా ఉజ్వల గ్యాస్ కనెక్షన్లను 35 మంది లబ్ధిదారులకు ఆదివారం పంపిణీ చేశారు. సర్పంచ్ గూడ గిరిజ, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఈశ్వరరావు పాల్గొన్నారు. ప్రజా సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో గ్రామ సంఘ అధ్యక్షుడు వై.సంతోష్‌కుమార్, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు సరస్వతి, నాయకులు వై.ఆనందరావు, టి.ఈశ్వరరావు ఉన్నారు.

బ్యాంకు పీవోగా ఈశ్వరి ఎంపిక



కోటబొమ్మాళి: దంత గ్రామానికి చెందిన సన్నకారు రైతు మెండ జోగారావు కుమార్తె ఈశ్వరి ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రొబేషనరీ అధికారిగా (పీవో) ఎంపికయ్యారు. ఈ మేరకు కడప జిల్లా కేంద్రంలోని ఏపీజీ బ్యాంకు ప్రధాన కార్యాలయం నుంచి శనివారం ఆమెకు ఉత్తర్వులు అందాయి. డిగ్రీ వరకూ ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే ఈశ్వరి చదుకున్నారు. ఆమెను గ్రామ సర్పంచ్ గొండు చాందిని, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పీఏ మురళీ ఆదివారం సత్కరించి అభినందించారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యవర్గం ఏర్పాటు

కవిటి: విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తున్నట్టు జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రోణంకి రామచంద్రరావు అన్నారు. మండల శాఖ అధ్యక్షుడు గొండ్యాల జానకీరామయ్య అధ్యక్షతన కవిటి మండల శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం జరిగింది. గౌరవాధ్యక్షుడుగా జి.జానకీరామయ్య, అధ్యక్షుడుగా ప్రియా బాబ్జీరావు, అసోసియేట్ అధ్యక్షుడుగా ప్రగడ వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా మార్పు అప్పలరాజు, ఉపాధ్యక్షులు మొగిలిపురి ఢిల్లేశ్వరరావు, పుల్లట సత్యన్నారాయణ, పండి విజయలక్ష్మి, కరగాన ఏకాంబరావు, సంయుక్త కార్యదర్శులుగా దండాశి రౌతో, పూడి భీమారావు, బార్ల జగన్నాథం, ట్రెజరర్‌గా మొగలిపురి కృష్ణారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా సంఘం కార్యదర్శి ఎ.ధర్మారావు, ట్రెజరర్ బి.మోహనరావు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణా టీకాలు



సరియాపల్లిలో పశువుకు టీకా చేస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: కురుడు, తిలారు పశువైద్యాధికారులు లఖినేని కిరణ్‌కుమార్, ఎస్ ప్రజ్ఞచైతన్య ఆధ్వర్యంలో ఆదివారం 1469 పశువులకు గాలికుంటు నివారణా టీకాలను వేశారు. కోటబొమ్మాళి, విశ్వనాథపురం, జగన్నాథపురం, బలరాంపురం, సరియాపల్లి, నారాయణపురం, బమ్మిడిపేట, పెద్దబమ్మిడి, మహదేవపురం, మహసాహెబ్‌పేట, కూర్మనాథపురం, గంగుపేట, నారాయణవలస గ్రామాల్లోని పశువులుక టీకాలు వేసినట్లు వైద్యులు తెలిపారు. వెటర్నరీ అసిస్టెంట్లు ముకుంధరావు, బలరాం, బాలమ్మ, పద్మజ్యోతి, మహేష్, ధర్మారావు పాల్గొన్నారు.

పిల్లలు బడిలోనే ఉండాలి



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న హెచ్‌ఎం సరోజిని

ఇచ్ఛాపురం రూరల్: బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని ప్రధానోపాధ్యాయురాలు జి.సరోజిని అన్నారు. డొంకూరు మత్స్యకార గ్రామంలో సుదీర్ఘంగా బడికి గైర్హాజరైన, తరచూ బడికి గైర్హాజరవుతున్న విద్యార్థుల ఇళ్లకు ఆదివారం వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమాన్ని వివరించి.. పాఠశాలకు పంపించాలని కోరారు. ఉపాధ్యాయులు జి.శంకరరెడ్డి, శ్రీహరి, వెంకటేశ్వరరావు, లోకేష్ ఉన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు

టెక్కలి రూరల్:



చిన్నబజార్‌లోని షాపు యజమానులతో మాట్లాడుతున్న పోలీసులు

సంక్రాంతి పండుగ నేపథ్యంలో టెక్కలి పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందుల్లేకండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు టెక్కలి ఎస్సై–2 రమేష్ బాబు తెలిపారు. ఇందులో భాగంగా నిత్యం రద్దీగా ఉండే పాత ఎన్‌హెచ్–5 రోడ్డు, జిల్లాపరిషత్ రోడ్డు, చిన్నబజార్ జంక్షన్ వద్ద రహదారి పక్కన ఏర్పాటు చేసిన దుకాణాలను ఆదివారం తొలగించారు. దుకాణదారులతో మాట్లాడి ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా ఉండాలని, నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే పలు కూడళ్ల వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను నిర్వహించారు.

వసతి గృహంలో సంక్రాంతి సంబరాలు



ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు



భోగి మంట వద్ద చిన్నారుల సందడి

కాశీబుగ్గ: పలాస బీసీ బాలికల ప్రభుత్వ వసతిగృహంలో ఆదివారం ముగ్గుల క్రాంతి పేరుతో సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యూవో డి.కృష్ణవేణి ఆధ్వర్యంలో బాలికలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం భోగి మంటను వేసి పండుగ విశిష్టతను తెలియజేశారు.